దాన్ని నేలమీద మూడుసార్లు కొట్టి గోదావరి వైపు నడవండి. మీ వెనక మీ వూళ్ళోని ఎలుకలన్నీ వస్తాయి. ఈ రాగి ఎలుకని గోదావరిలోకి విసిరేయండి. ఎలుకలన్నీ గోదావరిలో మునిగి చస్తాయి.

అతను: నువు చెప్పేది నమ్మమంటావా?

మందులషాపతను: ప్రయత్నించి చూడండి. పని చెయ్యకపోతే డబ్బు వాపస్.

గంటన్నర తర్వాత అతను ఎంతో ఎక్సయిటింగ్‌గా పరిగెత్తు కొచ్చాడు.

మందులషాపతను: నేనిచ్చిన రాగి ఎలుక పనిచేసిందాసార్?

అతను: అహ. ముందు ఇది చెప్పండి.మీ దగ్గర రాగి లాయర్లు కూడా వున్నాయా?

# ఎలక్షన్ జోక్స్

ఎన్నికలని కవులు పూర్వం 'ఎన్నెన్నో కలలు' అన్నారు. నిజమే. ఆ రోజుల్లో కొత్త ప్రభుత్వం మీద ఆశతో కలలు కనేవారు. కాని అన్ని పొలిటికల్ పార్టీలు, అన్ని ప్రభుత్వాలు ఆ కలలని, ఆ ఆశలను వమ్ము చేస్తూ వస్తున్నాయి కాబట్టి ఓ విధమైన నిరాశావాదం ప్రజల్లో ప్రభుత్వాల మీద, రాజకీయ నాయకులమీద ప్రబలింది. ప్రభుత్వ ఫెయిల్యూర్‌కి ఇండెక్స్ మనదేశంలో తరచూ చెలరేగే ఆందోళనలు, బంద్‌లు, సమ్మెలు, రాస్తారోకోలు, జైల్‌భరోలు, బాంబు దాడులు, ఉద్రేకపూరితమైన స్టేట్‌మెంట్స్, టెర్రరిస్టులు, నక్సలైట్లు.

సీరియస్‌గా ఇలా ఎంత రాసినా రాయచ్చు. బట్, కాసేపు ఎన్నికలని తలచుకొని సరదాగా నవ్వుకొందాం. 'ఎవరొచ్చినా స్విస్ బేంకుల్లోకి వెళ్ళే డాలర్లలో మార్పుండదు, ఆకౌంట్ నంబర్లలో తేడా మాత్రమే' అన్నది నా నిశ్చితాభిప్రాయం.

***

ఓ కేంద్రమంత్రి ఎన్నికల మీటింగ్‌లో ఆవేశంగా ప్రసంగిస్తూ 'నిజమే. నేను గతంలో కొన్ని తప్పిదాలు చేసాను. ఇప్పుడు వాటికి ప్రత్యేకంగా అపాలజీ చెప్పదలచుకున్నాను' అంటే, మీలాంటి తెలివికల వాడెవడో వెనుకనించి 'అయితే యం.పి. గా మీరు అపాలజీలు చెప్పే జాబితా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌తోకి ఎక్కుతుంది. కాబట్టి ముందా కార్యక్రమం పూర్తిచేసి మొదలెట్టండి' అన్నాడు.

***

ఓ యం.పి. ఎలక్షన్లలో నిలబడి డిపాజిట్ కూడా కోల్పోయాడు. పత్రికా ప్రతినిధి అతని ప్రతిస్పందన గురించి తెలుసుకోడానికి వెళ్ళి అడిగాడు జరిగిందానిమీద మీ అభిప్రాయం ఏమిటని.

"నేనో బాధితుడ్ని" అన్నాడు ఓడిపోయిన యం.పి.

"దేనివల్ల?" అని జర్నలిస్ట్ అడిగితే "కౌంటింగ్ సరిగ్గా జరగడం వల్ల" అని జవాబిచ్చాడా యం.పి.

***

ఎలక్షన్ స్పీచ్‌లు మీరు బహిరంగ సభల్లో వింటూంటారు. అభ్యర్థి మాట్లాడేదాంట్లో ఏది అబద్ధం, ఏది నిజం తెలుసుకోడానికో చిట్కా ఉంది. అతని పెదవులు కదిలినప్పుడు అతను చెప్పేది అబద్ధం అని గుర్తించవచ్చు. (అంటే వాళ్ళు మాట్లాడేదంతా అబద్ధమేనన్నమాట.)

***

ఓ ఎలక్షన్ స్పీచ్‌లో ఓ అభ్యర్థి తనతో పోటీచేసే అభ్యర్థి గురించి మాట్లాడుతూ 'అతన్ని కలుగులోని పందికొక్కు అనచ్చా?" అని అడిగాడట. 'అలా అనకూడదు' అని అతని సపోర్టర్స్ అరిస్తే ఆ అభ్యర్థి క్షణకాలం ఆగి ఇలా చెప్పాడు.

"గుడ్. అప్పుడు కలుగులో పందికొక్కులు సంతోషపడతాయి, తమతో పోల్చనందుకు."

***

ఎన్నికల సంబరాన్ని దినపత్రికల్లో అధికంగా చూడచ్చు. ఓ దినపత్రిక న్యూస్ ఎడిటర్ తన విలేఖరిని అడిగాడు. 'ఎన్టీఆర్ ఇవాళ

తన స్పీచ్‌లో ఏం చెప్పాడు?' అని. 'ఏం చెప్పలేదు' అని విలేఖరి సమాధానం ఇస్తే ఆ న్యూస్ ఎడిటర్ 'అయితే దానిగురించి రెండు కాలాలు మించి రాయకు' అని చెప్పాడు.

***

యం.పి. సీట్‌కి టిక్కెట్ దొరకడంలో ఎంతో పోటీ వుంటుంది. ఓ పార్టీ అధ్యక్షుడు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్నాడు.

పార్టీ అధ్యక్షుడు: రెండు ప్లస్ రెండు ఎంత?

టికెట్ కోరే ఒకటవ అభ్యర్థి: నాలుగు.

పార్టీ అధ్యక్షుడు అతగాడు ముక్కు సూటిగా పోయే లౌక్యం తెలీనివాడిగా భావించి అతనికి టికెట్ ఇవ్వలేదు.

పార్టీ అధ్యక్షుడు: రెండు ప్లస్ రెండు ఎంత?

టికెట్ కోరే రెండవ అభ్యర్థి: సాధారణంగా నాలుగు.

పార్టీ అధ్యక్షుడు అతగాడు ఏదీ సరిగ్గా నిర్ణయించుకోలేని వ్యక్తిగా భావించి అతడికి టికెట్ ఇవ్వలేదు.

పార్టీ అధ్యక్షుడు: రెండు ప్లస్ రెండు ఎంత?

టికెట్ కోరే మూడవ అభ్యర్థి : మీరు అది ఎంతవాలనుకుంటున్నారు?

రాజకీయాల్లో పనికొస్తాడని భావించి మూడవ అభ్యర్థికి పార్టీ అధ్యక్షుడు టికెట్ మంజూరు చేసాడు.

***

ఎన్నికల ప్రచారంలో ఓ అభ్యర్ది ఆవేశంగా ఇలా చెప్పాడు.

'దేశంలో ఆర్థిక ప్రోగ్రెస్‌కి కాంగ్రెస్‌కే ఓటు వేయండి. నిరుద్యోగ నిర్మూలనకి కాంగ్రెస్‌కే ఓటు వేయండి. మహిళా శ్రేయస్సుకి కాంగ్రేస్‌కే ఓటు వేయండి".

ఆ మాటలు విన్న ఓ పల్లెటూరి రైతు తన పక్కవాడితో 'ఓ మనిషి ఓ పార్టీకి మూడు సార్లు ఓటు వేయడం నేరం అని ఈ మనిషికి తెలిసినట్లు లేదు' అని కండువా దులుపుకుని వెళ్ళిపోయాడు.

అదే మీటింగ్‌లో ఆ కాబోయే యం.పి. వుద్రేకంగా ఇలా

చెప్పాడు.

"ప్రభుత్వంలోని మా ప్రత్యర్థులు కిక్‌బేక్స్‌తో స్విస్ బేంకుల్లో తమ అకౌంట్లు నింపుకుంటున్నారు. ఇప్పుడు మాకూ ఓ అవకాశం ఇచ్చి చూడండి...'

***

ఏ నెల్లో పొలిటికల్ లీడర్స్ ప్రజల్ని తక్కువగా మోసం చేస్తుంటారు?

ఫిబ్రవరి నెలలో.

***

మరోచోట ఓ యువ నాయకుడు మీటింగుల్లో లెక్చర్ దంచేస్తున్నాడు.

'ఈ ఎన్నికల్లో నాదే పైచేయి అయితే ఈ నగరంలో మహిళలకి పూర్తి రక్షణ కల్పిస్తాను. నా కాన్‌స్టువెన్సీలో నా కింద వుండే మునిసిపాలిటీలన్ని నగరాలని చెత్తాచెదారం చేయకుండా శుభ్రంగా వుండేలా, నా కింద వుండే వేశ్యాగృహాల్లోని వేశ్యలంతా....

***

"బ్రదర్స్. అవి చేస్తాను. ఇవి చేస్తాను. మీ బాగుకోసం ఇంకా నేనేం చేయాలో చెప్పండి" ఆవేదనగా, ఆవేశంగా అడిగాడో రాజకీయ పార్టీ మనిషి.

"దయచేసి పోటీ చేయొద్దు" అరిచారు ప్రజలంతా.

***

కేంద్రంలో ఇప్పుడున్న పభుత్వానికి మునుపు రూపాయికి చిల్లర వచ్చేది. ఇప్పుడు చిల్లరగా రూపాయి వస్తోంది.

– ఎలక్షన్ కేంపైన్‌లోని ఓ స్పీచ్ లోని వాక్యం.

***

అడ్వాన్స్ మోటార్ టేక్స్ కలెక్షన్ గురించి.

– భవిష్యత్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రజలు, 'తమ డబ్బుతో' ఎన్.టి.ఆర్. ఏం చేస్తున్నాడో చూడలేని దురదృష్టవంతులు.

***

"రాజీవ్‌గాంధీ మనదేశానికి ప్రధానమంత్రి అయేంత గొప్ప వ్యక్తేం కాదు. అంతర్జాతీయంగా అతని ప్రెస్టేజ్‌ని. అతని సమర్ధతని, ఇండియాని ట్వంటీ ఫస్ట్ సెంచరీలోకి నడిపించాలన్న అతని కోరికని, రాజకీయపరం అతని కుటుంబ చరిత్రని, అంతర్జాతీయ సమస్యల మీద అతని అవగాహనని మరచిపోతే, ఇంకేముంది అతన్ని గెలిపించి ప్రధానమంత్రిని చేయడానికి? అందుకని నాకే ఓటు వేయండి."

# ఆల్ అబవుట్ గొడుగు

గొడుగు లేని మధ్య తరగతి ఇల్లు వుండదంటే అతిశయోక్తి కాదు. చెప్పుల్లా గొడుగు కూడా మధ్య తరగతి ప్రజల అవసరాల్లో ఒకటి అయిపోయింది. మనుషుల్లో వున్న లింగభేధాలు గొడుగుకి కూడా ఆపాదించారు. పెద్దగా నల్లటి బట్టతో వుండే గోడుగు మగాళ్ళ గొడుగయితే, చిన్నగా రంగు రంగుల బట్టతో వుండే గొడుగు ఆడవాళ్ళ గొడుగుగా చలామణి అవుతోంది. నన్నడిగితే గొడుగుల్లో లింగభేదాలు సృష్టించింది గొడుగులు వుత్పత్తి చేసే వ్యాపారస్తులే. అందరికీ ఒకే గొడుగయితే ఇంటికో గొడుగుతో సరి. లింగ భేదాలు సృష్టించటంతో చచ్చినట్టు ఏ లింగం వారు ఆ లింగానికి చెందిన గొడుగుని వుపయోగించాలి. దాంతో ఇంటికి కనీసం రెండు గొడుగులు అమ్ముడవుతాయి.

అయినా మగాళ్ళకి పెద్ద గొడుగు ఆడవాళ్ళకి చిన్న గొడుగు ఏమిటి? ఇద్దరి తలల పరిమాణం రమారమి ఒకటే కదా. ఆడవాళ్ళ మెదడు బరువు మగాళ్ళ మెదడు బరువుకన్న తక్కువని చదువుకున్న వాళ్ళు ఆడవాళ్ళ గొడుగుల సైజుని తగ్గించి వుంటారు.

గొడుగు పుట్టి ఎంత కాలం అయిందో ఎవరికీ తెలీదు. కాని దీని జన్మస్థానం చైనా లేదా ఈజిప్ట్‌గా పరిశోధకులు నిర్ధారించారు. నిజానికి గొడుగు కనిపెట్టడానికి కారణం వర్షం నించి రక్షణ కోసం కాదు.